# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటుతో.. విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- కేంద్ర చేనేత జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ రేపు విశాఖపట్నంలో పర్యటిస్తారు.
- ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.
- ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

====================

గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ముఖ్యమంత్రి విద్యుత్ శాఖపై సమీక్ష చేపట్టారు. ఈ సమీక్షలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈపీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ ఎంతో ఉపకరిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ మౌలిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. అలాగే పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెంచాలని, ఈ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని.. అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

====================

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల, బోధనాసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. బయోమెట్రిక్ హాజరును కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. మందుల కొరత లేకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. పేద రోగికి కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందాలన్నారు. అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ…

(వాయిస్…30 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జౌళి రంగంలో ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తామని కేంద్ర చేనేత జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు కేంద్ర మంత్రి కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలోని మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఉన్న స్పిన్ టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఆయనకు రాష్ట్ర చేనేత జౌళి శాఖా మంత్రి సవిత, స్పిన్ టెక్స్ ఇండియా లిమిటెడ్ ఎం.డి. వల్లభనేని సుధాకర్ చౌదరి సాదర స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి స్పిన్ టెక్స్ ప్రాంగణంలో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి పట్టు పరిశ్రమ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఏ రంగంలోనైనా ముందుకు వెళ్లగలిగే సామర్థ్యం ఉన్న రాష్ట్రం అని, అలాగే చేనేత రంగంలో ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ముఖ్యంగా సాంకేతిక పరంగా జౌళి రంగం ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కాగా.. రేపు విశాఖపట్నం జిల్లా పర్యటనలో భాగంగా గ్లాస్ ఫైబర్ యూనిట్‌ను కేంద్రమంత్రి ప్రారంభించనున్నారు.

====================

విరామం

====================

ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరల మార్పులను నిత్యం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ 8వ సమావేశం ఈరోజు సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రుల కమిటీ సభ్యులైన ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. పప్పులు, బియ్యం, వంట నూనెలు, టమోటా, ఉల్లిపాయల వంటి నిత్యావసర వస్తువుల డిమాండ్, రిటైల్, హోల్‌సేల్ మార్కెట్ ధరల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ ప్రభావంతో కొంతమేర ధరలు పెరిగినా, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

====================

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వల్ల తమ జీవన విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. పీఎం కిసాన్ ద్వారా రైతులకు ఆర్థిక భరోసా, మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పేదలకు గృహ నిర్మాణం, ఆరోగ్య సేవలు వంటి పథకాలు ఎంతో ఉపయోగకరంగా మారాయని చెప్పారు. అదే విధంగా.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో ప్రజలకు సౌకర్యాలు పెరిగాయని తమ అనుభవాలను పంచుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామని, ఈ పథకాలు తమ కుటుంబాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయని లబ్ధిదారుడు జి. వెంకట్రావు ఆకాశవాణికి తెలియజేస్తూ...

(వాయిస్…20 సెకన్లు)

====================

రానున్న 2, 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ ప్రాంతం, నైరుతి, తూర్పు-మధ్య & పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన భాగాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని భాగాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తమిళనాడు తీరంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతూ, ప్రస్తుతం సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్నదని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందన్నారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల మెరిసే అవకాశముందని, బలమైన గాలులు గరిష్టంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముందని వివరించారు.

====================

విశాఖ రైల్వే జోన్ జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈరోజు విజయనగరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహానాడు వేదికగా స్త్రీ శక్తి నినాదంతో అనేక తీర్మానాలు చేయడం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం.. తెలుగుదేశం పార్టీలో మహిళా సాధికారితకు నిదర్శనం అని అన్నారు.

=====================
=====================